ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809

నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 260 | ఆదివారం, అక్టోబర్ 11, 2026 | పేజీలు : 06 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# ఎల్‌నినో ముప్పు..

# తెలంగాణ సర్కార్ అప్రమత్తం

**సమగ్ర కార్యాచరణకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు**

**నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా ముందస్తు చర్యలు**

**వచ్చే ఏడాది జూన్ వరకు సవాళ్లను ఎదుర్కొనేలా ప్రణాళిక**

**అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం**

**235 మండలాల్లో కరవు ఛాయలున్నట్లు అధికారుల నివేదిక**

**కరవు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్**



హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని:

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలపై దృష్టి సారించింది. ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్‌లో రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. శుక్రవారం సీనియర్ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో ఏర్పడే పరిస్థితులపై చర్చించారు. నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సీఎం సూచించారు. విద్యుత్ లభ్యతపై ఒత్తిడి ఉన్నందున విద్యుత్‌పై ఆధారపడే పనులను అవసరాన్ని బట్టి తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. నీటి సంరక్షణపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రసార మాధ్యమాలు, సినిమా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడాలని, దీర్ఘకాలిక కార్యాచరణ ఖరారు చేసేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సుమారు 235 మండలాల్లో కరవు ఛాయలు కనిపిస్తున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ ఉపసంఘం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలకు సహాయం అందించేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి లభ్యత, విద్యుత్ అవసరాలు, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సూచనలు తీసుకోనున్నారు. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందనే అంశంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీరు, విద్యుత్ వనరులను సమర్థంగా నిర్వహించడం ప్రభుత్వానికి కీలకంగా మారనుంది.

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్‌పై కేంద్రం కీలక ప్రకటన

**అలైన్‌మెంట్ ఖరారు కాకముందే భూసేకరణ చట్టవిరుద్ధం**

**మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లపై కేంద్రం స్పష్టత**

**భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి**

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్‌రెడ్డి భేటీ**

**అలైన్‌మెంట్ ఖరారయ్యాకే రాష్ట్రాలు, రైతులకు వివరాలు**

**హైదరాబాద్-చెన్నై, బెంగళూరు, పుణె మార్గాలపై చర్చ**



హైదరాబాద్, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):

హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల భూసేకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులకు సంబంధించి అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని వెల్లడించింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు పేరుతో చేపట్టే భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై ఇరువురు చర్చించారు. సమావేశం అనంతరం కిషన్‌రెడ్డి ఈ వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు భూసేకరణ అభ్యర్థనలు పంపలేదని రైల్వే మంత్రి స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే సంబంధిత వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రైతులకు తెలియజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్లు, ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. భూసేకరణను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న సమయంలో ఈ స్పష్టత వెలువడింది. మరోవైపు, కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్ మధ్య ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఉన్నతస్థాయి చర్చలు జరిగినట్లు దక్షిణ మధ్య రైల్వే కూడా సామాజిక మాధ్యమంలో పేర్కొంది. ఇదిలా ఉండగా, 2026--27 ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు రైల్వే బడ్జెట్ కేటాయింపుల నుంచి రూ.1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు కేంద్రం గతంలో వెల్లడించింది. దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది.

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు**

**గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 21.86 శాతం వృద్ధి**

**రేవంత్‌రెడ్డి పాలనకు గణాంకాలే నిదర్శనమని వెల్లడి**

**భూములపై బీఆర్ఎస్ ఆరోపణలను ప్రజలు విశ్వసించలేదని వ్యాఖ్య**

**గత పదేళ్ల పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని ప్రకటన**

**పెండింగ్ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలే లక్ష్యమని స్పష్టీకరణ**

నేటి ప్రభాత దర్శిని:

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని, రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని వెల్లడించారు. ఈ గణాంకాలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్‌రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భూములపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు విశ్వసించలేదని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడంతో పాటు ప్రజలకు వివాదరహిత భూములు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పొంగులేటి వివరించారు.

# తెలంగాణలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిది రోజుల పూల పండుగకు శ్రీకారం**

**రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా ప్రారంభమైన వేడుకలు**

**సంప్రదాయ వస్త్రధారణలో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు**

**తీరొక్క పూలతో బతుకమ్మల అలంకరణ**

**ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు ప్రత్యేక విద్యుద్దీపాల అలంకరణ**

**అక్టోబర్ 18న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని:



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన తొమ్మిది రోజుల పూల పండుగలో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రకృతితో మమేకమయ్యే ఈ వేడుకలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నాయి. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు తంగేడు, గునుగు తదితర రకరకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు చేరుకున్నారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు. చప్పట్లు కొడుతూ కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి వద్ద వేడుకలు వైభవంగా జరగగా, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పండుగలో రోజుకో ప్రత్యేకత, ప్రత్యేక నైవేద్యం ఉంటాయి. అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మతో ఉత్సవాలు ముగియనుండగా, అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. బతుకమ్మ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అక్టోబర్ 18న ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేయనున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్రంలోని జిల్లాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు పాఠశాలల్లోనూ బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. పూలను పేర్చి, పాటలు పాడుతూ మహిళలు తెలంగాణ సంప్రదాయాలను తరతరాలకు అందించేలా సంబరాల్లో భాగస్వాములవుతున్నారు.

# వ్యవసాయ బావిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు

**మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం**

**కురవి మండలంలో వెలుగుచూసిన ఘటన**

**అనూష (26), వర్షిణి (9), విశాల్ కృష్ణ (4) మృతి**

**సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల గాలింపు**

**తండా శివారులోని బావిలో ముగ్గురి మృతదేహాల గుర్తింపు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని:

మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. కురవి మండలంలో ఓ వ్యవసాయ బావిలో తల్లి, ఆమె ఇద్దరు పిల్లల మృతదేహాలు లభ్యమయ్యాయి. శనివారం వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కురవి మండలానికి చెందిన బానోతు అనూష (26)కు కుమార్తె వర్షిణి (9), కుమారుడు విశాల్ కృష్ణ (4) ఉన్నారు. శనివారం సాయంత్రం అయినప్పటికీ అనూష తన పిల్లలతో ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తుండగా, తండా శివారులోని వ్యవసాయ బావిలో అనూషతో పాటు ఇద్దరు చిన్నారుల మృతదేహాలు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను బావి నుంచి వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా, ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# వార్తా ప్రచురణతో స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు

**నేటి ప్రభాత దర్శిని కథనంతో నాలాపై మూత ఏర్పాటు**
**చంద్రాయణగుట్టలో ప్రమాదాలకు కారణమవుతున్న కచ్చా మోరి నాలా**
**గురువారం దినపత్రికలో సమస్యపై ప్రత్యేక కథనం**
**స్పందించి నాలాపై మూత బిగించిన జీహెచ్ఎంసీ అధికారులు**
**ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు**
**అధికారులకు, పత్రికకు ప్రజల కృతజ్ఞతలు**


(నాడు)


(నేడు)

**చంద్రాయణగుట్ట, హైదరాబాద్ (నేటి ప్రభాత దర్శిని):**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ ప్రచురించిన వార్తకు జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. చంద్రాయణగుట్ట ప్రాంతంలో ప్రమాదాలకు కారణమవుతున్న కచ్చా మోరి నాలాపై 'నేటి ప్రభాత దర్శిని' తెలుగు దినపత్రికలో గురువారం 'ప్రమాదాలకు పొంచి ఉన్న కచ్చా మోరి నాలా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు నాలాపై మూత బిగించే చర్యలు చేపట్టారు. దీంతో ప్రమాదాల ముప్పు తగ్గిందని భావిస్తున్న స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి దోహదపడిన 'నేటి ప్రభాత దర్శిని' దినపత్రికకు, తక్షణ చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దమ్మ తల్లి ఆలయానికి బీరువా విరాళం

**ఆలయ కమిటీ విజ్ఞప్తికి స్పందించిన గార్గే శ్రీనివాస్**
**తిర్మలాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయానికి కానుక**
**అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రి భద్రతకు బీరువా**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి సహకారం**
**కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, గ్రామ ప్రముఖులు**
**ఆలయాల అభివృద్ధికి అండగా ఉంటానని వెల్లడి**



**బాన్సువాడ (నేటి ప్రభాత దర్శిని):**

బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గార్గే శ్రీనివాస్ బీరువాను విరాళంగా అందజేశారు. ఆలయంలో అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రిని భద్రపరిచేందుకు బీరువా అవసరమని ఆలయ కమిటీ సభ్యులు కోరడంతో ఆయన స్పందించి వెంటనే అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ బాన్సువాడ గ్రామీణ మండల అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రఘు రామయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాజు, భాస్కర్‌రెడ్డి, చీకట్ల రాజు, అజయ్, హన్మండ్లు, సాయిలు, సాయిరెడ్డి, కాశీరాం, బాన్సువాడ సాయిలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గార్గే శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.

# దుర్గామాత ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి - డీఎస్పీ విట్టల్ రెడ్డి

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ.**



దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బాన్సువాడ డీఎస్పీ బి.విట్టల్ రెడ్డి సూచించారు. బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాన్సువాడ రూరల్ సర్కిల్ సీఐ తిరుపయ్య, ఎస్ఐలు టి.వెంకటరావు, పి.శిరీష, వివిధ దుర్గామాత మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించరాదని, నిమజ్జన ఊరేగింపులను నిర్ణీత మార్గాల్లోనే నిర్వహించాలని సూచించారు. వదంతులను నమ్మకుండా పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని కోరారు.

# నిస్వార్థ సేవకుడు సంతోష్‌రెడ్డి





**50వ సారి రక్తదానం చేసి ఆదర్శం**
**ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ప్రశంస**
**ఏటా నాలుగుసార్లు రక్తదానం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్**
**తోటి ఉద్యోగులు, యువతలో రక్తదానంపై అవగాహన**
**కెనడాకు వెళ్లే ముందు రక్తదానం చేసి సామాజిక బాధ్యత చాటింపు**
**ప్రశంసాపత్రం అందజేసి సన్మానించిన రక్తనిధి**

**కేంద్రం ప్రతినిధులు**

**కామారెడ్డి, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**

నిస్వార్థ సేవాభావంతో 50వ సారి రక్తదానం చేసి ధర్మారావుపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సంతోష్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయ సభ్యుడు డాక్టర్ బాలు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రక్తనిధి కేంద్రంలో సంతోష్‌రెడ్డి 50వ సారి రక్తదానం చేసిన సందర్భంగా ఆయన సేవలను డాక్టర్ బాలు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉన్నత స్థానంలో కొనసాగుతూ ప్రతి సంవత్సరం నాలుగుసార్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. తనతోటి ఇంజినీర్లతో పాటు యువతకు రక్తదానం ప్రాముఖ్యతను వివరిస్తూ వారిని కూడా ఈ సేవలో భాగస్వాములను చేస్తున్నారని కొనియాడారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పదోన్నతి పొంది కెనడాకు వెళ్తున్న సందర్భంగా కూడా రక్తదానం చేసి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారని తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అవసరమైన సమయంలో రక్తదాతలు ముందుకు రాకపోతే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సంతోష్‌రెడ్డిని అభినందించి ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు.

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయి పట్టివేత

**రూ.9 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం**
**మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల వ్యక్తి అరెస్ట్**
**నాగవల్లి ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తుండగా పట్టివేత**
**ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక తనిఖీలు**
**ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో నిఘా**
**అక్రమ మాదకద్రవ్యాల సమాచారం ఇవ్వాలని అధికారుల విజ్ఞప్తి**

**కామారెడ్డి (నేటి ప్రభాత దర్శిని):**

కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమంగా తరలిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. దసరా పండుగ నేపథ్యంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టారు. నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు అమృత్‌రెడ్డి, శిరీష, రాజు తనిఖీలు నిర్వహించారు. ఈ చర్యల్లో రైల్వే రక్షక దళం సిబ్బంది కూడా సహకరించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అశోక్ (26)గా గుర్తించామని, అతను మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన వ్యక్తి అని తెలిపారు. ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి నాగవల్లి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523కు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# మన సంస్కృతి.. మన సంప్రదాయం.. మన బతుకమ్మ

**ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వేడుకలు**
**మేడ శ్రీను అధ్యక్షతన ఘనంగా నిర్వహణ**
**బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సందడి చేసిన విద్యార్థులు**
**సంస్కృతి పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలి: రేగులపాటి రమ్యరావు**
**తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ: శశికళరెడ్డి**

**హైదరాబాద్ (నేటి ప్రభాత దర్శిని):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మేడ శ్రీను అధ్యక్షతన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ రేగులపాటి రమ్యరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా కమిషన్ సభ్యురాలు శశికళరెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. యువత తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు బట్టపోతుల మోహన్, నిత్యరెడ్డి, బైరు రవీందర్, ప్రకాశ్, అజయ్ రసకట్ల, వినయ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు.




# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వ్యాసరచన, ఫోటోగ్రఫీ, లఘు చిత్రాల పోటీలు

కరీంనగర్ : పోలీస్ ఫ్లాగ్ డే?2026 సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ తెలిపారు. విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజా భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లఘు చిత్రాలు గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివితో రూపొందించవచ్చని, ఫోటోగ్రఫీ పోటీల్లో పోలీసుల విధులు, ట్రాఫిక్ నిర్వహణ, పోలీసు?ప్రజల సంబంధాలకు సంబంధించిన ఫోటోలను సమర్పించవచ్చని తెలిపారు. లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ ఎంట్రీలను ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ద్వారా పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సూచించారు. విజేతలకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

# ఇందిరాగాంధీ స్టేడియంలో మళ్లీ దసరా ఉత్సవాలు







**ఘనంగా రావణ దహనం.. కనువిందు చేయనున్న లేజర్ షో**
**రూ.78 లక్షలతో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన**
**షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకల నిర్వహణ**
**1990లో ప్రారంభమైన ఉత్సవాలకు మళ్లీ పూర్వ వైభవం**
**త్వరలో ప్రత్యేక ఉత్సవ కమిటీ ఏర్పాటు**

**కామారెడ్డి, నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి:**

కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఏడాది నుంచి మళ్లీ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావణ దహనం, లేజర్ షో తదితర కార్యక్రమాలతో వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం స్టేడియంలో రూ.78 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కరోనా మహమ్మారి కారణంగా గతంలో నిలిచిపోయిన దసరా ఉత్సవాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 1990లో తొలిసారిగా మల్లన్నగుట్ట వద్ద రావణ దహనం, లేజర్ షోతో ఉత్సవాలు ప్రారంభించామని గుర్తుచేశారు. అనంతరం నాలుగేళ్లపాటు సీఎస్సీ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించామని, ఇందిరాగాంధీ స్టేడియం అందుబాటులోకి వచ్చిన తర్వాత సుమారు 20 ఏళ్లపాటు అక్కడే ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ ఏడాది నుంచి మళ్లీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఉత్సవాల నిర్వహణ కోసం త్వరలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తామని తెలిపారు. స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పూర్తయితే క్రీడాకారులకు, క్రీడా కార్యక్రమాలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. స్టేడియం అభివృద్ధితోపాటు దసరా ఉత్సవాల పునఃప్రారంభం ద్వారా పట్టణ ప్రజలకు పండుగ వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని షబ్బీర్ అలీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్వార్, షేరు, సత్యం, సిద్దిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, గూడెం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సందీప్, రాజగౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, సుతారి రమేష్, భూమని బాలరాజు, అనుమాల రాము కుమార్, అశోక్ రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్ రెడ్డి, గౌనె శ్రీనివాస్, ముబషీర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

**రాళ్లపేటలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**ప్రభుత్వ పథకాలు మరింత సులభంగా అందుతాయి**
**హామీ ఇచ్చిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునిగేల రాజు**
**లబ్ధిదారుల్లో హర్షం**



**తంగళ్లపల్లి, అక్టోబర్ 9 (నేటి ప్రభాత దర్శిని):**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునిగేల రాజు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన గ్రామ సర్పంచ్ బాలసాని పరుశురాములుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులతోపాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమామ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, కాంగ్రెస్ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ బాబు అలీ, నాయకులు కట్కం రాజశేఖర్, గణాధి కిషన్, ఇక్బాల్, సురేష్, దేవరాజు, బాలసాని శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రంగాపూర్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**హుజూరాబాద్, అక్టోబర్ 9 (నేటి ప్రభాత దర్శిని):**

హుజూరాబాద్ మండలం రంగాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.గ్రామాల్లోని బొడ్రాయి వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. భక్తిశ్రద్ధలతో గౌరమ్మను కొలుస్తూ, సంప్రదాయ బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు. పండుగ వాతావరణంతో గ్రామాల్లో సందడి నెలకొంది.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. తాగునీటి వసతితో పాటు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.

# ఖమ్మం అభివృద్ధి పనులన్నీ దశలవారీగా పూర్తి చేస్తాం

**రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్ల ప్రారంభం**
**ఇప్పటికే రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి**
**పుట్టపాక-రాజన్నపేట రహదారి నిర్మాణానికి చర్యలు**
**నాణ్యతలో రాజీ లేకుండా మౌలిక వసతుల కల్పన**
**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**



**ఖమ్మం, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**

ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 9, 12, 13, 14వ డివిజన్లలో రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో ఇప్పటివరకు సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇంకా మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను గుర్తించి, రానున్న రోజుల్లో చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు తదితర మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్మాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పుట్టపాక నుంచి రాజన్నపేట వరకు రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనులను గుర్తించి, వాటి వివరాలను సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి జీవించేలా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని మంత్రి తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సి ఈ సి గా జ్ఞానేశ్వర్ కుమార్ కొనసాగేందుకు నైతిక హక్కు లేదు

**(ఎక్స్, ఎన్ ఎస్ యూ ఐ )జిల్లా కన్వీనర్ తాళ్ళ కరుణాకర్ ముదిరాజ్**



సిద్దిపేట: దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాల్సిన అవసరం ఉందని (ఎక్స ఎన్ ఎస్ యూ ఐ )జిల్లా కన్వీనర్ తాళ్ళ కరుణాకర్ ముదిరాజ్ అన్నారు. అయితే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఇటీవల వెలుగులోకి వస్తున్న పరిణామాలు అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు కీలక అంశాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ ఐ ఆర్, ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, ఫ్రమ్ 6లో మార్పులు, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలోనే కీలక నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత సి ఈ సి పై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తే దాని ప్రభావం నేరుగా ప్రజాస్వామ్యంపై పడుతుందని అన్నారు. ఓటు హక్కు ఎవరి దయతో లభించిన హక్కు కాదు.. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయం గా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అదే సమయంలో అర్హత లేని పేర్లపై కూడా చట్ట బద్ధమైన విధానంలోనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ పేరుతో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ప్ర శ్నలు లేవనెత్తుతున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో ఎన్నికల సంఘం మరింత పారదర్శ కంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా పనిచేస్తుందనే భావన ప్రజ ల్లో కలగకుండా చూడటం అత్యంత ముఖ్యమని అన్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతే ఎన్నికల విశ్వసనీయతకు పునాది అని పేర్కొన్నారు. కమిషనర్ల మధ్య నమోదైన అభ్యంతరాలు, ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన వివాదాలు, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై వస్తున్నప్రశ్నలన్నింటిపైనా సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో నెలకొన్న అనుమానా లను నివృత్తి చేసేలా ఎన్నికల సంఘం పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థపై ప్రజలకు నమ్మకం తగ్గే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు.. ప్రతి ఓటు విలువను కాపాడటం, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం కూడా ఎన్నికల సంఘం బాధ్యత అని స్పష్టం చేశారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో సి ఈ సి. గా జ్ఞానేశ్వర్ కుమార్ కొనసాగడంపై నైతిక ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు

# మాదకద్రవ్యాలు, మద్యపానంతో అనర్థాలు

**వ్యసనాల దుష్ప్రభావాలపై దేశాయిపల్లిలో అవగాహన ర్యాలీ**
**ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు**
**వ్యసన విముక్తి, చికిత్స, పునరావాసంపై నిపుణుల అవగాహన**
**మై భారత్ పోర్టల్ నమోదుపై యువతకు వివరాలు**
**ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు**



**తంగళ్లపల్లి, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్లకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు ప్రత్యేక శిబిరంలో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాలు, మద్యపానం, ఇతర వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధానాన్ని జిల్లా యువజన అధికారి తిరుపతి రెడ్డి వివరించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మనస్తత్వ నిపుణులు డాక్టర్ పున్నం చంద్ర, హెల్పింగ్ ఆర్ట్స్ అండ్ సొసైటీ అధ్యక్షుడు ఈశ్వర్ పాల్గొని మానసిక ఆరోగ్య పరిరక్షణ, వ్యసన విముక్తి, చికిత్స, పునరావాసం అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి. మాధవి, డాక్టర్ ఎ. వెంకట్రామ్, గ్రామ సర్పంచ్ రజిత రమేష్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ రామకాంత్, డాక్టర్ శ్రీజ, డాక్టర్ శశాంక్‌తో పాటు యువకులు, మహిళలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# పోలేపల్లి అభివృద్ధికి రూ.70 కోట్లు





**రూ.4.65 కోట్లతో రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**
**దానవాయిగూడెం, రామునిపేటకు మెరుగైన రహదారి సౌకర్యం**
**అర్హులైన పేదలకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు**
**త్వరలో కొత్త రేషన్ డీలర్ ఏర్పాటు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఖమ్మం, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**

ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామంలో సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రూ.4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బీటీ రోడ్ల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.2.42 కోట్లతో పోలేపల్లి నుంచి మున్నేరు మీదుగా దానవాయిగూడెం వరకు, రూ.2.20 కోట్లతో పోలేపల్లి నుంచి రామునిపేట వరకు రహదారులు నిర్మించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలేపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే కొత్త రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలకు స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా నూతన పాఠశాల భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ మహేష్‌బాబు, స్థానిక సర్పంచ్ బత్తిని మహేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పితృ అమావాస్య సందర్భంగా శివపరాశక్తి పీఠంలో విశేష పూజలు

**శివనామస్మరణతో మారుమోగిన పీఠం**
**భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**
**పంచామృత, భస్మ విభూతి, అన్నాభిషేకాలతో ప్రత్యేక పూజలు**
**సప్తహారతులతో భక్తిపారవశ్యం**
**భక్తులకు ఆశీస్సులు అందించిన పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ**



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి):**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శివపరాశక్తి పీఠం పితృ అమావాస్య సందర్భంగా శివనామస్మరణతో మారుమోగింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పీఠంలో పరమశివునికి భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మ విభూతి అభిషేకం, ప్రత్యేక అన్నాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల శివనామస్మరణతో పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి సమర్పించిన సప్తహారతులు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం పీఠం ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు శివపరాశక్తి పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీ మనోహర్ రాజు గురూజీ ఆశీస్సులు అందజేశారు. పితృ అమావాస్య సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పీఠం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# ప్రజల హక్కుల కోసం పోరాటమే మార్గం

**యువత గొంతుకను అణచివేస్తున్నారంటూ కేంద్రంపై ఎంపీ వంశీకృష్ణ విమర్శలు**
**ఢిల్లీ నిరసనలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ**
**బ్రిటిష్ పాలనను తలపించేలా కేంద్రం వ్యవహరిస్తోందని వ్యాఖ్య**
**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణే లక్ష్యమని స్పష్టీకరణ**
**స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో పోరాడతామని వెల్లడి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**



ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలంతా గళమెత్తాలని, హక్కుల సాధనకు పోరాటమే మార్గమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న యువతను కేంద్ర ప్రభుత్వం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. యువత గొంతుకను అణచివేయడం, శాంతియుత నిరసనలకు ఆటంకాలు కల్పించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ హక్కుల కోసం గళమెత్తుతున్న యువతను చూసి భయపడుతోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు 56 మెట్రో స్టేషన్లను మూసివేశారని, బస్సుల రాకపోకలను నిలిపివేశారని ఆయన ఆరోపించారు. 40 వేల మందికి పైగా పోలీసు బలగాలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని మోహరించారని, విమానాశ్రయాల్లో పౌరులను అదుపులోకి తీసుకుంటున్నారని, స్వతంత్ర జర్నలిస్టులను నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని విమర్శించారు. యువతపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు బ్రిటిష్ పాలనను, జలియన్‌వాలాబాగ్ ఘటనను గుర్తు చేస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను బ్రిటిష్ పాలనతో పోలుస్తూ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తామని, ప్రజల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ కల్పనలో.. రాష్ట్రంలో జిల్లా ఫస్ట్






**శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్**
**సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ**
**ప్రణాళిక ప్రకారం జిల్లాలో వీబీజీ రామ్ జీ పనులు**
**జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 4,02,360 పని దినాల కల్పన**
**ఉత్తమ పనితీరుపై రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన**

**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ -10**

వీబీజీ రామ్ జీ కింద ఉపాధి హామీ పనులు కల్పనలో జిల్లా రాష్ట్రంలో ముందు స్థానంలో నిలిచింది. జిల్లా యంత్రాగాన్ని రాష్ట్ర అధికార యంత్రాంగం అభినందించింది. శాశ్వత ఆస్తుల కల్పన.. వనరుల సంరక్షణ పనులు చేయిస్తూ జిల్లా అధికార యంత్రంగా ముందుకు సాగుతోంది.

**విస్తృతంగా ఉపాధి హామీ పనులు**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వికసిత్ భారత్-- గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవక మిషన్(వీ బీ జీ రామ్ జీ) కార్యక్రమం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

**ఇప్పటికే శిక్షణ..**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ఉపాధి పనులపై జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తించి.. చేయిస్తున్నారు.

**గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం..**

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 378 పనులు గుర్తించింది. రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు అనువైన.. అలాగే కూలీలకు ఉపాధి కల్పించే పనులను అధికార యంత్రాంగం చేపడుతుంది. ప్రతి కూలీకి 125 పని కల్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు అధికారులు. చెరువుల్లో పూడిక తీత, మట్టి రోడ్ల నిర్మాణం, ఫిష్ పాండ్స్, అటవీ భూముల్లో కందకాల నిర్మాణం, మొక్కలు నాటడం, సంరక్షించడం, అటవీ భూముల్లో మొక్కలు నాటడం, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్య ఇస్తూ ముందుకు వెళ్తున్నారు. పొలాల కాలువల శుభ్రత, సాగునీటి కాలువల మరమ్మతు లాంటి శ్రమ ఆధారిత పనులను గుర్తించి చేయిస్తున్నారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ ను నియమించి, మొబైల్ ఫోన్ ద్వారా హాజరు నమోదు చేసేలా చర్యలు చేపట్టింది.

**మరింత పెంచేందుకు చర్యలు**

జిల్లాలో మొత్తం 260 గ్రామ పంచాయతీలు ఉండగా, మొత్తం 98 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి రోజు 32, 148 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 09వ తేదీ వరకు 4,02,360 పని దినాలు కల్పించడం జరిగింది.

**తెలంగాణ జలసిరి పనులు**

వాన నీటి సంరక్షణ, భూ గర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జలసిరి పథకం కింద పనులు చేయిస్తుంది. జిల్లాలో 210 ఫామ్ పాండ్స్, 1769 మ్యాజిక్ సోక్ పిట్స్, 91 సామూహిక ఇంకుడు గుంతలు, 464 బోర్ వెల్ రీచార్జ్ గుంతల పనులు పురోగతిలో ఉన్నాయి.

**రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన**

జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి సగటున 45 మంది కూలీలు ఉపాగి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికం. ఉపాధి కల్పనలో ముందున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ కింద వేతనాలకు రూ.12 కోట్ల 90 లక్షలు ఇవ్వగా, మెటీరియల్ కోసం 76 లక్షల రూపాయలు కేటాయించారు. మెటీరియల్ కోసం ఇంకా 7 కోట్ల 37 లక్షల ఖర్చు చేయాల్సి ఉంది.

**కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక - గరిమ అగ్రవాల్, జిల్లా కలెక్టర్**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాము. ఇందులో భాగంగా ఇప్పటికే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తమ ప్రాంతంలో అనువైన పనులు చేయించడంపై శిక్షణ ఇప్పించాం. పనులకు కూలీలు భారీ సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషం. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాం.

# మహాలయ అమావాస్య సందర్భంగా 300 మందికి అన్నదానం

**రాజన్న ఆలయం వద్ద పేదలు, భక్తులకు అన్నప్రసాద వితరణ**
**దాతల సహకారంతో నిరంతరాయంగా అన్నదాన సేవలు**
**పితృదేవతల జ్ఞాపకార్థం అన్నసంతర్పణ చేసిన కుటుంబాలు**
**పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా సేవలకు అవకాశం**
**దాతలు ముందుకొచ్చి అన్నార్తులకు చేయూతనివ్వాలి: ట్రస్టు నిర్వాహకులు**



**నేటి ప్రభాత దర్శిని అక్టోబర్ 10 వేములవాడ**

మహాలయ అమావాస్యను పురస్కరించుకుని రాజన్న ఆలయం వద్ద 300 మంది పేదలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో కొనసాగుతున్న అన్నదాన సేవల్లో భాగంగా పితృదేవతల పేరుతో పలువురు కుటుంబ సభ్యులు అన్నసంతర్పణలో భాగస్వాములయ్యారు. తమ పూర్వీకుల జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో పలువురు దాతలు ముందుకొచ్చారు. రేణుక, కుమారుడు శివరాజు, కుమార్తెలు శ్వేత, శిరీష కుటుంబ సభ్యులు; సద్దల రమాదేవి, సద్దల మనోహర్, సద్దల విజయలక్ష్మి కుటుంబ సభ్యులు; బొడ్డు ప్రేమ్‌కుమార్, హారిక దంపతులు, చిన్నారులు సాన్వి, సుజయ్, కార్తిక్; ఉపేంద్ర శర్మ, నీరజ దంపతులు; గర్శకుర్తి వెంకటేశ్వర్లు, వేణు; జవ్వాజి భూలక్ష్మి, భూమయ్య దంపతులు; ద్వారక శేఖర్, శ్రీదేవి దంపతులు; కొక్కొండ నరసింహచారి, శోభ దంపతులు; కప్పగంటి మహేష్ శర్మ, హిమజ దంపతులు; పాత రాధాకిషన్, పావని దంపతులు; బుస్సా కిరణ్‌కుమార్, సౌమ్య దంపతులు; రామక మనోహర్ శర్మ, చిన్నారి షణ్ముఖ ప్రియా, చిరంజీవి అభిరామ్ శర్మ; యామ దేవరాజు, సమత దంపతులు; చంద్ర మోహన్, పాశం భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు; నాగుల దేవేందర్, సరస్వతి; నాగుల చంద్రశేఖర్, భవాని దంపతులు; రుద్రంగి రాఘవేంద్ర శర్మ, సుచిత్ర దంపతులు; చర్లపల్లి అశోక్, శ్రీలత దంపతులు; పసుల రమేష్, సంధ్యారాణి దంపతులు; నక్క నరసవ్వ కుటుంబ సభ్యులు; మిరియాల వేణు, బాలలక్ష్మి దంపతులు; బొందిల్ల వనజ; నాగుల సురేష్, ఝాన్సీ దంపతులు; పాడి ప్రకాష్‌రెడ్డి, కోడం నాగరాజు, తోట దేవరాజు, బాలప్రభ దంపతులు; నేరెళ్ల మానస, నరేష్ గౌడ్ దంపతులు; ఏలేశ్వరపు సుప్రజ, సాయినాథ్ దంపతులు; హరిదత్త శర్మ; కరిని రాజశేఖర్, లావణ్య దంపతులు; కారంగుల మధుసూదన్‌రావు, కవిత దంపతులు; మామిడిపల్లి శోభారాణి కుటుంబ సభ్యులు; జవ్వాజి రాజశేఖర్ గౌడ్, కారింగుల రాజేందర్ కుటుంబ సభ్యులు; పల్లెర్ల భూమయ్య, వసంత దంపతులు; ఉగిలే అమ్మాయి, ఉగిలే స్వాతి, సుధీర్ దంపతులు; గొట్టం శ్రీనివాస్, లక్ష్మి దంపతులు; కాందూరి శ్రీకాంత్, మాళవిక దంపతులు; శ్రీధర్, సంధ్య దంపతులు; నాగాంజని, హరికృష్ణ దంపతులు; పెరిక దేవయ్య పటేల్, శ్రీలత దంపతులు; రాపెల్లి తిరుమలేష్ కుటుంబ సభ్యులు; యాద భాను ప్రకాష్, మానస దంపతులు; నూకలమర్రి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు; కూరగాయల మల్లేశం, కూరగాయల సాయి కృష్ణ, ప్రియాంక దంపతులు; గట్టేపల్లి సంపత్‌కుమార్, నిర్మలాదేవి దంపతులు, వారి కుమార్తె సుకృతి; మేఘమాల, నాగిని, వినయ్ దంపతులు; శ్రీరామోజు శివకుమార్, చిలుక నర్సింహులు, విలాసాగర్ అరవింద్, చొప్పకట్ల చంద్రశేఖర్, పల్లవి దంపతులు, నల్ల లక్ష్మి, వంగల శ్రీధర్ తదితరులు అన్నదాన సేవలకు సహకరించారు. పితృపక్షాల సందర్భంగా చేపూరి జగన్నాథం జ్ఞాపకార్థం ఆయన సతీమణి వజ్రమ్మ, కుమారుడు రాజు, కుమార్తె లక్ష్మి; చీకోటి మురళి, సుగుణ, జ్యోతి జ్ఞాపకార్థం చీకోటి కృష్ణ; ఉప్పుల లింగయ్య, లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు దేవరాజు, పద్మ దంపతులు, మనుమడు ఉప్పుల పవన్‌రాజ్, మనవరాలు శ్రావణి భవాని; హనుమకొండకు చెందిన రామ లక్ష్మీపతి జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు రామ వెంకటేశ్వర్లు, సుమతి దంపతులు; చింతలఠానం మైసయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు; జిల్లా శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. చిన్నారి పాత సహస్ర పుట్టినరోజు సందర్భంగా పాత సంతోష్ కుటుంబ సభ్యులు కూడా అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అన్నదాన శాశ్వత సభ్యులుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు, స్నేహలత, ప్రతాప, స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి మఠం శైలజ, సాంబశివు, దేవరాజు, ఉమ, బాలచందర్, రాజు దంపతులు, రామడుగు శ్రీలత, వారి కుమారులు, కోడళ్లు ప్రజ్ఞ, శరత్చంద్ర, శిరీష, సాయిచంద్ర, శర్వాణి, రవిచంద్ర, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, ఇతర శుభకార్యాల సందర్భంగా పేదలకు ఒకపూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను లేదా 9246939388 నంబరును సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, ప్రతాప, నటరాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, కొప్పుల హనుమాన్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, ఏలేశ్వరపు సాయినాథ్, రామక మనోహర్, పిన్నింటి హనుమాండ్లు, గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ కేసులపై ఈడీ పిటిషన్

**త్వరిత విచారణకు హైకోర్టును ఆశ్రయం**
**రోజువారీ విచారణకు విజ్ఞప్తి**
**దశాబ్దకాలంగా పెండింగ్‌లో తొమ్మిది చార్జిషీట్లు**
**డిశ్చార్జ్ పిటిషన్లతో నిలిచిన విచారణ**
**నిందితుల వ్యక్తిగత హాజరుకు అభ్యర్థన**
**తదుపరి విచారణపై ఉత్కంఠ**




**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని :**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. కేసులను రోజువారీగా విచారించి త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించింది. ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్దకాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడంతో విచారణ ముందుకు సాగడం లేదని తెలిపింది. జగన్‌తో పాటు ఇతర నిందితులు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ కేసుల్లో గత కొన్నేళ్లుగా ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయపరమైన సవాళ్లు కొనసాగుతుండగా, తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

# సన్న బియ్యం ఎగుమతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు

**అంతర్జాతీయ మార్కెట్లకు తెలంగాణ సన్న బియ్యం**
**మనీలా సదస్సులో విదేశీ కొనుగోలుదారులకు ఆహ్వానం**
**గత సీజన్‌లో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి**
**దేశీయ మార్కెట్‌లో కిలో రూ.80 దాటిన సన్న బియ్యం ధర**
**ఎగుమతుల్లో పోటీపై మిల్లర్ల ఆందోళన**

**నేటి ప్రభాత దర్శిని అక్టోబర్ 10**



తెలంగాణలో పండుతున్న నాణ్యమైన సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలు దారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్‌సీ)--2026లో రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను వెల్లడించింది. సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు అంతర్జాతీయ రిటైలర్లు, ఆహార సంస్థలు, ఎగుమతిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు. దేశీయంగా మిగులు నిల్వల నిర్వహణకే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో బియ్యానికి అధిక విలువ కల్పించడమే లక్ష్యమని వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎగుమతుల ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపారు. గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న బియ్యాన్ని, ఎక్కడ పండించారో గుర్తించగలిగే విధంగా, ప్రత్యేక బ్రాండ్లతో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30 వేల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసిన అనుభవంతో ఈ ప్రయత్నాలను మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు పెరగడం సామాన్యులకు భారంగా మారింది. ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలతో బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గిందని కథనంలో పేర్కొన్నారు. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70గా ఉన్న సన్న బియ్యం ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.82కు చేరిందని, 25 కిలోల బస్తా ధర సుమారు రూ.2,150 పలుకుతోందని సమాచారం. అదే సమయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో అంతర్జాతీయ ఎగుమతుల్లో పోటీని తట్టుకోవడం కష్టమవుతోందని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరలకు బియ్యం లభిస్తుండటంతో మధ్యప్రాచ్యం, పశ్చిమ ఆఫ్రికా మార్కెట్లలో భారత బియ్యానికి పోటీ పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు. దేశీయ అవసరాలు, రైతుల నుంచి ధాన్యం సేకరణకు ప్రాధాన్యం ఇస్తూనే ఎగుమతి అవకాశాలను అన్వేషిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్లో తెలంగాణ బియ్యానికి స్థానం కల్పించడంతో పాటు దేశీయంగా ధరలను నియంత్రించడం ప్రభుత్వానికి కీలక సవాలుగా మారనుంది.

# రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ**
**టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణ**
**ప్రభుత్వానికి రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం**
**తక్కువ ధరకు బిడ్లు వేసినవారిని తప్పించారని విమర్శ**
**కేవలం ఐదు పని దినాల్లోనే ప్రక్రియ పూర్తి చేయడంపై ప్రశ్నలు**
**కాగ్ ప్రత్యేక ఆడిట్, శ్వేతపత్రం విడుదలకు డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబర్ 10 (నేటి ప్రభాత దర్శిని):**



రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేడియల్ రోడ్డు-2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. టెండర్లను తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేస్తూ శనివారం బహిరంగ లేఖ రాశారు. రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని జాతీయ రహదారి-167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాన్ని మూడు ప్యాకేజీలుగా విభజించి, అనుకూల సంస్థలకు పనులు అప్పగించారని లేఖలో పేర్కొన్నారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన సంస్థలను అనర్హులుగా ప్రకటించి, అంచనా వ్యయం కంటే అధిక ధరలకు పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆరోపించారు. సెప్టెంబర్ 30న బిడ్ల దాఖలుకు గడువు ముగియగా, కేవలం ఐదు పని దినాల్లోనే, అక్టోబర్ 8 నాటికి సాంకేతిక మూల్యాంకనం, అర్హతల పరిశీలన, ఆర్థిక బిడ్ల ప్రారంభం, పనుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయడంపై సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్లను అంత తక్కువ సమయంలో ఎలా పరిశీలించి నిర్ణయాలు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్యాకేజీ-1 పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ప్యాకేజీ-2 పనులను బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ-3 పనులను జీకేసీకి అప్పగించారని తెలిపారు. అంచనా వ్యయాలు, సంస్థలు కోట్ చేసిన ధరలు, బిడ్డర్లను అనర్హులుగా ప్రకటించడానికి గల నిర్దిష్ట కారణాలు, తుది కాంట్రాక్టు విలువలు, సాంకేతిక మూల్యాంకన నివేదికలు సహా టెండర్లకు సంబంధించిన అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కేటాయించిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, రేడియల్ రోడ్డు-2 టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు టెండర్లపై కేటీఆర్ చేసిన ఆరోపణలు, పారదర్శకతపై ఆయన లేవనెత్తిన ప్రశ్నలు రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీశాయి.

# మేదరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

**మిర్యాలగూడ, నేటి ప్రభాత దర్శిని అక్టోబర్ 10**

మిర్యాలగూడ పట్టణంలో మేదరి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ ప్రారంభాన్ని పురస్కరించుకుని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నల్లగొండ జిల్లా మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి నోముల నరేందర్, మిర్యాలగూడ మేదరి సంఘం అధ్యక్షుడు జోర్రిగల నాగరాజు సంఘం కోశాధికారి జోర్రిగల బిక్షపతి, నోముల రేణుక, నోముల ధనలక్ష్మి జోర్రిగల అనిత నోముల వెంకటరమణ పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం మన సంప్రదాయాలకు, ప్రకృతి ప్రేమకు నిదర్శనమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాలని అన్నారు. మహిళల ఐకమత్యానికి, కుటుంబాల మధ్య ఆత్మీయ అనుబంధాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మిర్యాలగూడలో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. మహిళలు, సంఘం సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కమాన్ పూర్ మండలంలో గ్రామ గ్రామాన ఎంగిలిపూల బతుకమ్మ.

**కమాన్ పూర్**

కమాన్ పూర్ మండలంలో గ్రామ గ్రామాన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా శనివారం జరిగాయి. తెలంగాణలోనే అతి పండుగలో ముఖ్యమైనది బతుకమ్మ వేడుకలు. ఈ వేడుకలుమండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపి కుంట నాగారం పెంచికలపేట సిద్ది పల్లె, కిష్టం పల్లె రాజాపూర్ లింగాల గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆయా గ్రామాల్లోని చావళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ యాసలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. ఈ వేడుకల్లో ప్రస్తుత సర్పంచులు పల్లె మాధవి, బంగారు కళ్యాణి, పోల్ దాసరి వనిత, తో పాటు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మల అనంతరం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

# ఈ నీరు అమృతంతో సమానం!

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి. ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6–8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణులు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్పరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.



## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?



వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.